ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 3
సోమవారం 17 జూన్ 2024



అన్న క్యాంటీన్లు వచ్చేస్తున్నాయ్..!

- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం చంద్రబాబునాయుడు
- గతంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో ఏర్పాటు
- అధికారంలోకి రాగానే రద్దు చేసిన జగన్
- మళ్లీ పునరుద్ధరించిన టీడీపీ ప్రభుత్వం
- జిల్లాలో లక్షలాది పేదలకు ఉపయోగం
- సామాన్యుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం



కర్నూలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగో సంతకం చేశారు. పేదల ఆకలి తీర్చే మంచి పనికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని సామాన్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే సామాన్యులు, పట్టణాల్లో ఉండే పేదలకు రూ.5కే టిఫిన్, భోజనం అందించాలనే మహోన్నత ఆశయంతో గత తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే జిల్లాలో కర్నూలు నగరంలో కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పూల బాజారులో ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్ వద్ద, శ్రీనివాస్ థియేటర్ దగ్గర, ఆదోనిలో ప్రభుత్వ స్త్రీలు, చిన్నపిల్లల ఆస్పత్రి ఆవరణలో, పాత బస్టాండ్ సమీపంలో, పోస్టాఫీసు దగ్గర మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు, ఆస్పత్రులకు వచ్చే వారికి, సొంత అవసరాల కోసం పట్టణాలకు వచ్చే వారికి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో కూడా క్యాంటీన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున 750 నుంచి వెయ్యి మందికిపైగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేసేవారు. ఈ లెక్కన కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోనిలో రోజుకు 8 వేల నుంచి 10 వేలు చొప్పున పేదల ఆకలి తీరేది. ఎందరో పేదలనను అన్నపూర్ణగా అన్న క్యాంటీన్లు ఆదరించాయి.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు పేరు మీద టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా 2018 జూన్ 11న ఏర్పాటు చేసింది. అన్న క్యాంటీన్ల కోసం అక్షయపాత్ర అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు దాదాపు 2.25 లక్షల మంది రాష్ట్ర వ్యాప్తంగా 7.25 కోట్ల మంది ఆకలి తీర్చిన క్యాంటీన్ అన్న క్యాంటీన్లు నిలిచిపోయాయి. ఒక్క క్యాంటీన్‌లో ఉదయం 300 మంది, రాత్రి 250 మందికి ప్రతి రోజు రూ.5లకు నాణ్యమైన భోజనం అందించేవారు. అయితే 2019 మే 30న జగన్ ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లు వల్ల చంద్రబాబుకు పేరు వస్తుందనే కసితో వీటికి తాళం వేశారు. పేదల కడుపుకొట్టారు. అన్న క్యాంటీన్లను సచివాలయాలుగా మార్చారు. కర్నూలు సర్వజన వైద్యశాలతో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనం నిరుపయోగంగా మార్చారు. గురువారం చంద్రబాబు ఒక్క సంతకంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీకి అంత వణుకెందుకు..?

2019 ఆగస్టు 1న అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మూసివేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. పేదవారికి పట్టడన్నం పెట్టడాన్ని మాజీ సీఎం జగన్ రెడ్డి ఓర్చుకోలేకపోయాడు. అంతటితో ఆగకుండా అన్నం పెట్టే నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేశాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను వైసీపీ నాయకులు ధ్వంసం చేశారు. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పట్టించుకోలేదు. దీంతో అన్న క్యాంటీన్లను కొనసాగించాలని డిమాండ్ పేదవారి నుంచి గట్టిగా వినిపించింది. కానీ ప్రతిపక్షంలోకి వచ్చిన టీడీపీ ముద్ర అన్న క్యాంటీన్లపై ఉండటంతో జగన్ ప్రభుత్వం ఏ మాత్రం సహించలేకపోయింది. అన్న క్యాంటీన్ల భవనాల రంగులు కూడా మార్చేసింది.



పేదల కడుపు నింపుతాయి

ఎంతో మంది పేదల కడుపులు నింపే అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభిస్తున్నారంటే ఆనందంగా ఉంది. ఇది ఎంతో మంచి నిర్ణయం. చిన్న చిన్న పనులు చేసుకొని జీవనం సాగించేవారు ఆకలితో పడుకోకుండా అన్న క్యాంటీన్లలో కడుపు నింపుకుంటారు. పేదల ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయిం తీసుకోవటం హర్షణీయం.

- శ్రీనివాసులు, ఆటో డ్రైవర్, కోటేకల్



ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనం



క్యాంటీన్లు ప్రారంభించడం అభినందనీయం

ఎంతో మంది నిరుపేదలు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు సీఎం చంద్రబాబు నాయుడు మళ్లీ ప్రారంభించడం అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి పనుల నిమిత్తం వస్తే, అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి, ఆకలి తీర్చుకునేవాళ్లం. బయట రూ.70-రూ.100 పెట్టి భోజనం చేయాలంటే కష్టం. మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాంటీన్లు ప్రారంభించడం సంతోషం.

- నరసయ్య, పెద్దతుంబళం గ్రామం



చాలా మంచి నిర్ణయం

అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించటం చాలా మంచి నిర్ణయం. గతంలో జగన్ అన్న క్యాంటీన్ల గురించి తెలుసుకోకుండా గడ్డిగా మూసేయించారు. అది సరైంది కాదు. ఎంతో మంది పేదలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారు అన్న క్యాంటీన్లలో కడుపు నింపుకునేవారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే తిరిగి క్యాంటీన్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవటం ఎంతో ఆనందంగా ఉంది.

- వీరయ్య, చిరువ్యాపారి, ఎమ్మిగనూరు

నేడు బక్రీద్



ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

కర్నూలు (కల్చరల్), జూన్ 16: త్యాగనిరతిని చాటి చెబుతూ, దైవం పట్ల ఆరాధన భావాన్ని పెంచే 'బక్రీద్ (ఈద్-ఉల్-అదా) పండుగను సోమవారం ఉమ్మడి జిల్లాల్లోని ముస్లింలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలను ప్రత్యేక ఈద్ ప్రార్థనలకు సిద్ధం చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బక్రీద్ వేడుక రోజున ఆరు బయట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం మత పెద్దలు ధార్మిక సందేశాలు ఇస్తారు. ఈ నేపథ్యంలో ఆయా ఈద్గాల్లో వందలాదిగా హాజరయ్యే భక్తులకు నగర పాలక సంస్థ అధికారులు తగిన సదుపాయాలు కల్పించారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండు రోడ్డులోని పాత ఈద్గాను, సంతోష్ నగర్‌లోని కొత్త ఈద్గాను ఎస్పీ జి. కృష్ణకాంత్ పరిశీలించారు. బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక పండుగ రోజున ఇళ్లలో తయారు చేసుకునే ప్రత్యేక తీపి వంటకాలకు కావాల్సిన సేమ్యా డ్రైఫ్రూట్, మసాలా దినుసులు వంటి సామగ్రి కొనుగోళ్లకు పాతనగరంలోని మార్కెట్ ప్రాంతాలు సందడిగా కనిపించాయి.

దానగుణాన్ని, త్యాగ నిరతిని పెంచేదే బక్రీద్...

బక్రీద్ పండుగ సమాజంలోని వ్యక్తుల్లో దానగుణాన్ని, త్యాగ నిరతిని పెంపొందిస్తుంది. తమ ఇంటితోపాటు పేదలు, దగ్గరి బంధువులు, ఇరుగుపొరుగు వారిని కూడా ఈ సంతోషంలో భాగస్వామ్యం చేయాలని ఉద్బోధిస్తుంది. తమకు కలిగిన దానిలో కొంత దానం చేసి, తాము తినేదానిలో కొంత ఇతరులకు పెట్టాలని చెబుతుంది. అందుకే బక్రీద్ వేడుక రోజున త్యాగనిరతిని చాటుకుంటూ ఇతరులకు తమవంతు సహకారాలు అందిస్తారు.

బక్రీద్‌కు పటిష్ట భద్రత

- ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు, జూన్ 16: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. ఆదివారం ఆయన చెక్‌పోస్టులు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూలబజారు, పట్టణ శివారులోని జోహరాపురం, గుత్తి పెట్రోల్ బంకు, సంతోష్ నగర్ హైవే దగ్గర ఉన్న కొత్త ఈద్గా, పంచలింగాల చెక్‌పోస్టుల వద్ద ఆయన తనిఖీ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి ఆయన పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా హిందూ, ముస్లింలు సహకరించాలని కోరారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా ఉంచామని చెప్పారు. నగరంలో పోలీస్ పికెట్లు, మొబైల్ పార్టీలను బృందాలుగా ఏర్పాటు చేసి గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. పుకార్లు, వదంతులను నమ్మకూడదని సమస్యలు ఉంటే డయల్ 100కి గానీ, స్థానిక పోలీసులకు గానీ ప్రజలు తెలియజేయాలని సూచించారు. ఎస్పీ వెంట పట్టణ డీఎస్పీ విజయశేఖర్, సీఐలు నాగరాజు యాదవ్, ప్రసాద్, పవన్‌కుమార్, శంకరయ్య, ట్రాఫిక్ సీఐ గౌతమి, ఎస్‌ఐ ఖాజావలి ఉన్నారు.



భద్రల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జి. కృష్ణకాంత్

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు, జూన్ 16: బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ట్రాఫిక్ సీఐ గౌతమి ఆదివారం తెలిపారు. హైదరాబాదు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు కర్నూలు టౌన్‌లోకి రాకుండా తిప్పమ్మ కొట్టం నుంచి నేషనల్ హైవే మీదికి మళ్లిస్తారు. ఆర్టీసీ బస్టాండు ఔట్ గేటు నుంచి ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి పెట్రోల్ బంకు మీదుగా బిర్లా జంక్షన్, సీ. క్యాంపు సర్కిల్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు మీదుగా మళ్లిస్తారు. అలాగే నంద్యాల చెక్‌పోస్టు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను మద్దూరునగర్ నుంచి డైవర్షన్ చేసి బిర్లా జంక్షన్, గుత్తి పెట్రోల్ బంకు మీదుగా ఆర్టీసీ బస్టాండుకు మళ్లిస్తారు.

పిడుగుపాటుకు గొర్రెలకాపరులు మృతి

తుగ్గలి, జూన్ 16: పిడుగు పడి ఇద్దరు గొర్రెల కాపరులు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం మండల పరిధిలోని రామలింగాయపల్లె, చెన్నంపల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం 6 నుంచి 7 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గొర్రెలను తోలుకొని ఇంటికి చేరుకుంటుండగా చెన్నంపల్లి చెరువులో పిడుగు పడింది. దీంతో గొర్రెల కాపరులు ఎరుకుల కామేశ్వరి (33), సుంకన్న (40) మృతి చెందారు. ఈశ్వరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. అతనితోపాటు ఉన్న భార్య సంధ్య క్షేమంగా బయటపడింది. అయితే.. దాదాపు 600 గొర్రెలు కనిపించకుండాపోయాయి. సుంకన్న మృతితో భార్య వెంకటమ్మ, ఇద్దరు కొడుకులు బోరున విలపించారు. ఎరుకుల కామేశ్వరి మృతి చెందడంతో ఆమె భర్త ఎరుకుల సుంకన్న, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, టీడీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాబాషాలు సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు.



కామేశ్వరి మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త ఎరుకలి సుంకన్న

మరొకరికి గాయాలు



మృతి చెందిన సుంకన్న

అందరం ఒకే గుండు కింద కూర్చున్నాం: ఈశ్వరయ్య

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో గొర్రెలన్నీ ఒక చోట వదిలి మేము నలుగురం ఒకే గుండు కింద కూర్చున్నాం. వర్షం తగ్గిందని నేను, నా భార్య గుండు నుంచి పక్కకు వచ్చాం. అంతలోనే పిడుగు గుండు మీద పడటంతో అక్కడే ఉన్న కామేశ్వరి మృతి చెందింది. సుంకన్న పక్కనే ఉన్న నీటిలో పడి మృతి చెందాడు. కళ్లు మూసి తెరిచేలోపే ఈ ఘటన జరిగింది. దీంతో ఏం జరుగుతుందో తెలియని నిస్సాహాయ స్థితిలో గ్రామస్థులకు సమాచారం అందించాను.



రబీ నష్టం లెక్కింపులో నిర్లక్ష్యం

- పంట దున్నేసిన నాలుగు నెలలకు నష్టం లెక్కించిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 54 మండలాల్లో అనావృష్టి
- 31 మండలాలకే కరువును పరిమితం చేసిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ ప్రభుత్వంపైనే రైతుల ఆశలు
- 19 నుంచి 21 దాకా కరువు పరిశీలనకు కేంద్ర బృందం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 16:

గత రబీలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారిని అదుకోకుండా వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. దాదాపు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రైతులు 3 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసి నష్టపోతే 1.30 లక్షల హెక్టార్లలో, 128.57 కోట్ల పంట నష్టం మాత్రమే జరిగిదని అధికారులు నివేదిక తయారు చేశారు. అయితే అప్పటి ప్రభుత్వం మాత్రం గత నెల 24, 25 తేదీల్లో క్షుణ్ణంగా సర్వే చేసి నష్టాన్ని అందజేయాలని ఆదేశించింది. పంటలన్నీ ఎండిన తర్వాత ఖాళీ పొలాల్లో రబీ నష్టాన్నిఎలా లెక్కించాలో తెలియక అధికారులు తూతూ మంత్రంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లల్లో కూర్చొని రెండు జిల్లాల నివేదికలు తయారు చేశారు. 128.57 కోట్లలో నష్టం జరిగిందని మొదట్లో పంపిన నివేదికను సవరించి రెండోసారి కేవలం 96.03 కోట్ల పంట నష్టం మాత్రమే జరిగిందని నిర్ధారించారు. నష్టపరిహారాన్ని కుదించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ మొత్తం అంచనాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం రైతుల విన్నపాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కనీసం రైతు భరోసా కేంద్రాల్లో నష్టపరిహారం జాబితాను ప్రదర్శించకుండా జాగ్రత్త పడింది. చాలా మండలాల్లో అధికారులు అనర్హులకు కూడా పంట నష్టపరిహారాన్ని నమోదు చేశారని, అర్హులైన రైతులను లబ్ధిదారులుగా చేర్చడంలో నిర్లక్ష్యం చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించనుంది.



31 మండలాలకే పరిమితం చేసిన ప్రభుత్వం

గత రబీలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిలాల్లో రైతులు ప్రధానంగా సాగు చేసిన పప్పుశనగ, జొన్న, మొక్కజొన్న, మినుములు, వరి, కందులు, కొర్ర పంటలన్నీ దెబ్బతిన్నాయి. అయితే.. వర్షాలు లేక ఈ పంటలన్నీ దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 54 మండలాల్లోనూ కరువు పరిస్థితులు తాండవించాయి. పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని నష్టపోయారు. గత వైసీపీ ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదు. గుడ్డిగా కేవలం 31 మండలాల్లోనే పంటలు నష్టం జరిగిందని గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కోడుమూరు, కల్లూరు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి హొళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సీ. బెళగల్ మండలాల్లోనే పంటలు నష్టపోయి కరువు పరిస్థితులు ఉన్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, నందికొట్కూరు, అవుకు, కోవెలకుంట్ల, మిడ్తూరు, సంజామల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, గోస్పాడు, జూపాడుబంగ్లా, నంద్యాల, బనగానపల్లె, గడివేముల మండలాల్లో మాత్రమే కరువు పరిస్థితులు ఉన్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. వాస్తవంగా రబీలో పంటలు నష్టపోయిన మండలాలను ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను గుర్తించి నష్టపరిహారాన్ని అంచనావేసి రైతులకు అందజేయాల్సి ఉంది. అయితే.. ప్రభుత్వం మార్చి 16న కరువు ప్రకటన జారీ చేసింది. ఎన్నికల షెడ్యూలు వస్తున్నందు వల్ల రైతుల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబకకుండా ఈ ప్రకటన జారీ చేసిందనే విమర్శ అప్పట్లో వినిపించింది.



వైసీపీ నాయకుల ఇళ్లలో కూర్చుని అంచనా: గత రబీలో కరువు పరిస్థితిని అంచనా వేసి, నష్టపోయినవారి జాబితాను పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే.. జిల్లా వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది వైసీపీ నాయకుల ఇళ్లల్లో కూర్చుని నివేదికలు తయారు చేశారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వారిని, పంటలు సాగు చేయని రైతులను అర్హులుగా తేల్చి వారికి పెద్ద మొత్తంలో పరిహారాన్ని అందేలా జాబితా తయారు చేశారు. అర్హులైన రైతులు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారని వైసీపీ నాయకులు గుర్తిస్తే.. అధికారులు దాన్నే ప్రమాణంగా తీసుకని వారిని అనర్హులుగా తేల్చేశారు.

మార్చి 16న ప్రకటన : సాధారణంగా జూన్ 1 నుంచి వ్యవసాయ పంటల సీజన్లు మొదలవుతాయి. ఆయా సీజన్లలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోతే ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా అధికారులను అప్రమత్తం చేసి కరువు జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. అయితే.. జనవరిలో గత రబీ సీజన్ పూర్తయితే.. పంటలన్నీ ఎండిన తర్వాత ఖాళీగా ఉన్న పొలాలకు వెళ్లి పంట నష్టాన్ని లెక్కించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఏదోలాగా అమలు చేయాలని అధికారులు గత రబీలో పంట నష్టాన్ని లెక్కవేసేందుకు హడావుడిగా పొలాలకు కదిలివెళ్లారు. పొలాల్లో ఏ ఆనవాళ్లు లేకపోవడంతో ఇండ్లలో, కార్యాలయాల్లో, వైసీపీ నాయకుల వద్ద కూర్చుని నష్ట పరిహారం జాబితాను తయారు చేసి చేతులు దులుపుకున్నారు.

టీడీపీ ప్రభుత్వం న్యాయం చేయాలని రైతుల వేడుకోలు: గత సంవత్సరం ఖరీఫ్‌లో అనావృష్టి కారణంగా పంటలు ఎండిపోయి రైతులు నష్టాలపాలైతే.. ప్రభుత్వం నూటికి 30 మంది చొప్పున రైతులకు మాత్రమే పరిహారాన్ని అందించింది. అదే విధంగా రబీలో సాగు చేసిన పంటలు కూడా వానలు లేక ఎండిపోయాయి. ఈ దారుణ పరిస్థితుల నుంచి ప్రభుత్వం తమను గట్టెక్కిస్తుందని అన్నదాతలు ఎంతో నమ్మకంతో ఉన్నారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం వీరి ఆశలపై నీళ్లు చల్లి దారుణంగా ముంచేసింది. ప్రాథమిక అంచనాలో రెండు జిల్లాల్లో కలిపి రూ.128.57 కోట్ల పంట నష్టం జరిగిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ మొత్తాన్ని కుదించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో జిలా అధికారులు దీన్ని రూ.96.03 కోట్లకే పరిమితం చేసేశారు.

కేంద్ర బృందం ఢిల్లీ నుంచి ఈ నెల 19, 20, 21 తేదీల్లో కరువు పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను పరిశీలించనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపడంతో భారీగా నష్టపరిహారం కుదింపు జరిగింది. ఈ పరిస్థితిని ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం తప్పకుండా గుర్తించి వాస్తవంగా నష్టపోయిన రైతులందరికీ పరిహారాన్ని అందించేందుకు కేంద్ర బృందానికి సరైన లెక్కలను తయారు చేసి చూపించాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

గత రబీలో నష్టపోయిన పంటలు, రైతుల వివరాలు

పంట పేరు	నష్టపోయిన రైతులు	పంట నష్టం విస్తీర్ణం (హె.కా)
వేరుశనగ	2773	2772.51
మొక్కజొన్న	4299	5549
కందులు	773	473
జొన్న	22777	22014
మినుములు	5864	4891
వరి	1512	1155
కొర్ర	1216	1207
పప్పుశనగ	71055	73871

రైతుల్ని ఆదుకోండి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్రంగా రైతులు నష్టపోయారు. కర్నూలు జిల్లాలో కేవలం 18 మండలాలు, నంద్యాల జిల్లాలో 13 మండలాల్లో మాత్రమే గత ఖరీఫ్‌లో రైతులు పంటలు నష్టపోయారని ప్రభుత్వం పేర్కొనడం దారుణం. ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 19, 20 తేదీల్లో కేంద్ర బృందం ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వస్తున్నది. అందువల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నిబంధనలను పక్కనపెట్టి జరిగిన నష్టానికి పరిహారాన్ని తెలుగుదేశం అందించాలి.

- రామక్రిష్ణ
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 16: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో యోగా హాలులో కర్నూలు జిల్లా స్థాయి యోగా సంఘం పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి అవినాశ్ శెట్టి తెలిపారు. ఈ పోటీలు 8 నుంచి 10 సంవత్సరాలు, 10 నుంచి 12 సంవత్సరాలు, 12 నుంచి 14, 14 నుంచి 16, 16 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారికి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9247400100 నెంబరును సంప్రదించాలన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 16: పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన కర్నూలు, నంద్యాల జిల్లాలోని రజక కులానికి చెందిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు రజక ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, స్కంద బిజినెస్ పార్కులోని రజక విద్యసేవా సమితి కార్యాలయంలో రజక ప్రతిభ పురస్కారాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలో పదో తరగతిలో 450 ఆపై మార్కులు సాధించిన రజక విద్యార్థులు, ఇంటర్‌లో 850 మార్కులు పైగా, డిగ్రీలో 80 శాతం, బీటెక్‌లో 80 శాతం ఉత్తీర్ణత, ఎంసెట్, మెడిసిన్, ఇంజనీరింగ్‌లో 10వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు తమ వివరాలను స్కంద బిజినెస్ పార్క్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో షాపు నెంబర్.9, నాల్గవ అంతస్థులో సంప్రదించాలన్నారు. వివరాలకు 9110396511, 9182708114, 7780506001, 9640500145 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మాలంగిరి గణేష్, సీహెచ్ లింగమయ్య, ఎక్స్ ఆర్మీ శంకరయ్య, మహిళా నాయకురాలు బాపనపల్లి రాధ, రేణుకమ్మ, మద్దూరు వెంకటప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మహానంది, జూన్ 16: మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన చిన్న నరసింహులు(18) అనే వ్యక్తి శనివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు, గమనించిన కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

మంత్రి బీసీని సన్మానించిన వేదపండితులు

మహానంది, జూన్ 16: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులను మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో వేదపండితులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం బనగానపల్లిలోని మంత్రి స్వగృహంలో కలిసి మంత్రి దంపతులను ఆశీర్వదించారు. స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటంతో సన్మానించారు. ఈ సందర్భంగా మహానంది పరిసర ప్రాంతాల్లో అధ్వానంగా రహదారులను ఆధునికీకరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి ఈవో తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.



మంత్రి బీసీ దంపతులకు మెమెంటో అందజేస్తున్న ఈవో

‘వైవిధ్యమైన కవిత్వ శిల్పమే ‘బాల్యమే శరణార్థి’



‘బాల్యమే శరణార్థి’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు(కల్చరల్), జూన్ 16: వైవిధ్యమైన కవిత్వ శిల్పం ‘బాల్యమే శరణార్థి’ పుస్తకంలో కనిపిస్తుందని, విశాల ప్రాపంచిక దృక్పథంతో రత్నం ఏసేపు బాల్యమే శరణార్థి సంపుటిలోని కవిత్వం రాశారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, ఉద్యోగ క్రాంతి పత్రిక ప్రచురణగా డీటీఎఫ్ నాయకుడు, కవి కె. రత్నం ఏసేపు రాసిన బాల్యమే శరణార్థి కవితా సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది. సభాధ్యక్షుడిగా కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు వ్యవహరించారు. పుస్తక ఆవిష్కర్తగా విచ్చేసిన కెంగార మోహన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో కవి స్పష్టంగా రాశారని అన్నారు. సమాజం పట్ల ఎంతో బాధ్యతగా ఈ కవిత్వాన్ని రాశారని, అనేక కోణాలను సృజిస్తూ రాసిన కవితలు అన్ని వర్గాలను ఆకట్టుకుంటాయని తెలిపారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ విద్యారంగంలో ఎలాంటి ప్రమాదం పొంచి ఉందో కవి తన కవిత్వంలో రత్నం ఏసేపు ఆవేదనగా చెప్పారని అన్నారు. బాల్యంలోని హింసను కవి అర్థం చేసుకున్నందు వల్ల ప్రపంచంలోని అనేక హింసారూపాలను తెలుసుకొని ఈ కవిత్వం రాశారని అన్నారు. పాలస్తీనాలో, కశ్మీర్‌లో, దండకారణ్యంలో బాల్యాన్ని యుద్ధం బలి తీసుకుంటున్నదని, ఈ వేదనంతా రత్నం ఏసేపు కవిత్వంలో ఉందని అన్నారు. యుద్ధాలన్నీ బాల్యానికి శత్రువులని, ఈ నేల మీద దురాక్రమణ యుద్ధాలు ఉన్నంత వరకు బాల్యం శరణార్థిగానే ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో విరసం నాయకుడు నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, ఆద్య మెడికల్స్ అధినేత ఏవీ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు రాములు, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలతో భూములు గల్లంతు

డోన్(రూరల్), జూన్ 16: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డోన్ మండలంలోని గ్రామాల్లో చేసిన రీ సర్వేలో రైతుల భూములు గల్లంతయ్యాయని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అప్పటి అధికార పార్టీ నాయకుల సూచనలతో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేలో భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వర్షాకాలంలో ఖరీఫ్ సీజన్‌లో బ్యాంకుల ద్వారా రుణాలు పొందాలనుకునే రైతుల భూములు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జూన్ శుభసూచకం

సాధారణం కంటే రెట్టింపు వర్షపాతం నమోదు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 16: కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం జూన్‌లో వర్ష పాతం సాధారణం కంటే రెట్టింపు నమోదైంది. నాలుగు మండలాల్లో మాత్రమే సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. కౌతాళంలో 15 రోజులకుగానూ 110.2, ఆదోనిలో 69.8, మంత్రాలయంలో 121, కోసిగిలో 93.3, పెద్దకడుబూరులో 38.8, ఎమ్మిగనూరులో 143.2, గూడూరులో 102 ఎంఎం, కల్లూరులో 116, కర్నూలు రూరల్‌లో 125.4, ఓర్వకల్లులో 15 రోజుల్లోనే 220.8 ఎంఎం వర్షం నమోదైంది. కోడుమూరులో 83.2, గోనెగండ్లలో 97.6, హొళగుందలో 133.6, హాలహర్విలో 193.2, ఆలూరులో 197.6, ఆస్పరిలో 81, పత్తికొండలో అత్యధికంగా 200.8, చిప్పగిరిలో 220ఎంఎం, మద్దికెరలో 140.8, కర్నూలు అర్బన్‌లో 169.6, తుగ్గలిలో 137 ఎంఎం వర్షం నమోదైంది. 15 రోజులకే సాధారణ వర్షపాతానికి మించి మొత్తం మీద 122.5 ఎంఎం కర్నూలు జిల్లాలో నమోదైంది. ఇంకా 15 రోజులు సమయం ఉండటంతో రెట్టింపు వర్షపాతం జూన్‌లోనే కురిసే అవకాశం ఉందని, విత్తనాలు వేసుకునేందుకు రైతులకు మంచి అవకాశం అని జేడీ వరలక్ష్మి తెలిపారు.

మామ చేతిలో అల్లుడి దారుణ హత్య

- కూతురిని వేధిస్తుండటమే కారణం
- నిద్రిస్తున్న సమయంలో తలపై రాళ్లతో దాడి

ఉండవల్లి, జూన్ 16 : పెళ్లయిన ఏడాది నుంచి కూతురిని వేధిస్తుండటంతో సహనం కోల్పోయిన మామ అల్లుడిని చంపేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు, అలంపూర్ సీఐ రవిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటి ఆరు సంవత్సరాల క్రితం తన కుమార్తె మహేశ్వరికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులోని కొండారెడ్డినగర్ కాలనీకి చెందిన దేవేందర్ (36)తో వివాహం చేశారు. వారికి శ్యాంసుందర్, శ్రీకృష్ణ ఇద్దరు కుమారులున్నారు. అయితే మద్యానికి బానిసైన దేవేందర్ పెళ్లయిన రెండు నెలల నుంచే మహేశ్వరిని నిత్యం వేధిస్తున్నాడు. ఈ విషయంపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. అయినా అతడిలో మార్పు రాలేదు. దీంతో కొన్ని నెలల క్రితం మహేశ్వరి ఉండవల్లిలోని తన పుట్టినింటికి వచ్చేసింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు దేవేందర్ అత్తగారింటికి వచ్చి గొడవపడ్డాడు. అదే రోజు రాత్రి మద్యం తాగి వచ్చి అర్ధరాత్రి వరకు మామ, భార్యతో మళ్లీ గొడవ పడి ఇంట్లోనే పడుకున్నాడు. మహేశ్వరి పిల్లలతో కలసి నాయనమ్మ పద్మమ్మతో పాటు ఇంటి ముందున్న గుడిసెలో పడుకోగా, మద్దిలేటి బయట పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత మద్దిలేటి లేచి, ఆవరణలో ఉన్న నాపరాయి, పొయ్యి రాళ్లతో ఇంట్లోకి వెళ్లి అల్లుడు దేవేందర్ ముఖంపై బలంగా బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలులో పలు హోటళ్లలో వంట మాస్టర్‌గా పని చేసేవాడని తెలిసింది. మృతుని తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిబాబు వెల్లడించాడు. నిందితుడు మద్దిలేటి పరారీలో ఉన్నట్లు తెలిపారు. డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన పరిణామాలు, ఇంట్లో జరిగిన ఘర్షణ తదితర అంశాలను ఎస్ఐ శ్రీనివాసులు నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 16: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డు లారీ హమాలీ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో న్యూసిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్. సాయిబాబ, యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆపండి.. ఆపండి!



- ప్రయాణికులు కేకలు పెట్టినా ఆగని ఆర్టీసీ బస్సులు
- కోడుమూరులో ప్రయాణికుల కష్టాలు
- కండక్టర్ లేదని.. సీట్లు లేవని..
- డ్రైవర్ల వ్యవహారంతో నష్టాల్లో ఆర్టీసీ
- సింగిల్ స్టాప్, టూ స్టాప్ బస్సుల పరిస్థితి ఇంతే
- ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు


బస్సు ఆపకుండా వెళ్తున్న ఎమ్మినూరు డిపో ఆర్టీసీ బస్సు

కోడుమూరు, జూన్ 16: కోడుమూరులో పాత బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపై గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. బస్సు ఎప్పుడొస్తుందో తెలియదు.. బస్సు వచ్చినా.. ఆగుతుందో లేదో తెలియదు. దీని వలన వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత బస్టాండ్ మీదుగా కర్నూలుకు వెళ్లే ప్రతి బస్సు వెంట ఆపండి... ఆపండి అంటూ ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. కొంత మంది డ్రైవర్లు సీట్లు ఖాళీగా ఉన్నా బస్సును ఆపకుండా వెళ్లిపోతున్నారు. బస్సులపై ఆధారపడి కాలేజీలు, ఆఫీసులు, ఆసుపత్రులు, ఉపాధి కోసం కర్నూలుకు వెళ్లే పేద, మధ్య తరగతి ప్రజలకు డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను ఆపకుండా నరకం చూపిస్తున్నారు. కాలేజీ, ఆఫీసులు, ఆసుపత్రులకు సమయానికి వెళ్లలేకపోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీట్లు ఖాళీ... ఆర్టీసీకి నష్టం

35 కిలో మీటర్ల దూరంలో ఉన్న కర్నూలుకు ప్రతి రోజు కోడుమూరు మండలం నుంచి వేలాది మంది ప్రయాణికులు పనుల నిమిత్తం బస్సుల్లో వెళ్లి వస్తుంటారు. అయితే కొంత మంది బస్సు ఖాళీగా ఉన్నప్పటికీ డ్రైవర్లు సూచించిన ప్రదేశాలల్లో బస్సులు నిలపడం లేదు. మరి కొంత మంది కండెక్టర్లు టిక్కెట్లు కొట్టే ఓపిక లేక.. బస్సు ఖాళీగా లేదు. సీట్లన్నీ ఫుల్లయ్యాయి.. బస్సు దిగేయండి.. వెనుక ఖాళీగా మరో బస్సు వస్తుంది... ఆ బస్సులో రండి.. దిగండి అంటూ ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తించి బస్సులోంచి దింపేసి వెళ్తున్నారు. వెనక వచ్చే బస్సును ఆపినా ఆ బస్సు నుంచి కూడా ఇదే పరిస్థితి ప్రయాణికులకు ఎదురవుతోంది. దీంతో చేసేది లేక ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండెక్టర్లు ఇలా వ్యవహరించడంతో ఆర్టీసీ నుంచి ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుందని ప్రయాణికులు విమర్శలు వ్యక్తం చేశారు.

కోడుమూరు ప్రయాణికులను పట్టించుకోని సింగిల్, టూ స్టాప్ బస్సులు :

ఎమ్మినూరు నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి ఆదోనికి సింగిల్ స్టాప్ బస్సులు, టూ స్టాప్ బస్సు సర్వీసులు ఉన్నాయి. ఎమ్మినూరు నుంచి కర్నూలుకు వెళ్లే సింగిల్ స్టాప్ బస్సులు కోడుమూరులో కొత్త, పాత బస్టాండ్ బస్సు ఖచ్చితంగా నిలపాలి. అలాగే ఆదోని నుంచి కర్నూలుకు వెళ్లే టూస్టాప్ బస్సులు కూడా కోడుమూరులో నిలపాలి. అయితే ఆర్టీసీ డ్రైవర్లు కోడుమూరు ప్రయాణికులను పట్టించుకోకుండా సీట్లు ఖాళీ లేదు. కండక్టర్ లేదు అంటూ బస్సును ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు కోడుమూరు ప్రయాణికులంటే చిన్న చూపు చూస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కోడుమూరు ప్రయాణికులను పత్తికొండ డిపోకు చెందిన బస్సులు ఆదుకుంటున్నాయని, ఆ బస్సులే లేకుంటే తమ పరిస్థితి మరింత ఘోరంగా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు డిపో బస్సు డ్రైవర్లు కోడుమూరు ప్రయాణికులను పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

ఆర్టీసీకి ఆదాయం



కోడుమూరు మండలం చుట్టూ ఉన్న ఇతర మండలాల నుంచి రోజుకు వేలాది మంది ప్రయాణికులు కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, బళ్ళారి, పత్తికొండ తదితర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. కోడుమూరు ప్రయాణికులు లేకుండా చాలా బస్సులు ఖాళీగా వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండెక్టర్లు నిర్లక్ష్యం వహించడం సబబుకాదు.

- శ్రీనివాసులు, ప్రయాణికుడు, కోడుమూరు

డ్రైవర్, కండక్టర్లపై చర్యలు తీసుకోవాలి



కోడుమూరులో బస్సులను ఆపకుండా ఆర్టీసీకి నష్టాలు తీసుకొస్తున్న డ్రైవర్, కండెక్టర్‌పై ఆర్టీసీ అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి. స్కూల్ విద్యార్థులను చూస్తే బస్సులను అస్సలు ఆపడం లేదు. దీని వలన విద్యార్థులు సకాలంలో పాఠశాల, కాలేజీలకు వెళ్లలేక చదువులో వెనకబడుతున్నారు. కాబట్టి ఆర్టీసీ అధికారులు వీటిని గ్రహించి తగు చర్యలు తీసుకోవాలి.

- రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

మంత్రులకు అభినందనల వెల్లువ

కర్నూలు(అర్బన్), జూన్ 16: మంత్రి టీజీ భరత్‌ను ఆదివారం ప్రముఖులు కలిశారు. సంకల్ బాగ్‌లోని మంత్రి నివాసంలో కలెక్టర్ జి. సృజన, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇరువురు జిల్లా అభివృద్ధి విషయాలపై చర్చించుకున్నారు. అనంతరం డీఆర్వో మధుసూదన్ రావ్, సీఎఫ్ఓపీ రామక్రిష్ణ, రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, రాగమయూరి బిల్డర్స్ అధినేత కేజే రెడ్డి, మాంటిస్సోరీ విద్యా సంస్థల అధినేత రాజశేఖర్, టీడీపీ నాయకులు బోల్లెద్దుల రామక్రిష్ణ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు కలిసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- నగరంలోని మౌర్యఇన్‌లో మంత్రి టీజీ భరత్‌ను నగర టీడీపీ నాయకులు జి, నాగరాజు యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


టీజీ భరత్‌ను సన్మానించిన దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దస్తగిరి, ఎంపీ నాగరాజు, విష్ణు

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు

గూడూరు, జూన్ 16: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని గూడూరు టీడీపీ నాయకులు కలిసారు. ఆదివారం జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్ ఆధ్వర్యంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కురువ హనుమంతు, టీడీపీ నాయకులు దుర్గ సామెల్, రవి, ఇబ్రహీం భాషలు మర్యాద పూర్వకంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి ఘనంగా సన్మానించారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కురువ హనుమంతు, నాయకులు దుర్గ సామెల్, రవి, ఇబ్రహీంబాషా పాల్గొన్నారు.


కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసిన గూడూరు టీడీపీ నాయకులు

కోడమూరు ఎమ్మెల్యేను కలిసిన కాకినాడ డీఆర్వో

కర్నూలు(రూరల్), జూన్16: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

- ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్‌నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంయుక్తంగా కలెక్టర్ డా. సృజనకు పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.


మంత్రి బీసీ దంపతులను సన్మానిస్తున్న గౌరు దంపతులు

మంత్రులకు గౌరు దంపతుల శుభాకాంక్షలు

కల్లూరు, జూన్ 16: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బనగానపల్లెకు విచ్చేసిన రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బనగానపల్లెలోని బీసీ నివాసంలో మంత్రిని కలిసిన గౌరుచరిత పుష్పగుచ్ఛం అందించారు.

- రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం గౌరు దంపతులు మంత్రి ఫరూక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, దేవేంద్రారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, క్రిష్ణ నాయక్ పాల్గొన్నారు.


కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సన్మానిస్తున్న గూడూరు టీడీపీ నాయకులు

దూదేకుల సంక్షేమానికి కృషి చేస్తా : మంత్రి

కర్నూలు(అర్బన్), జూన్ 16: ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన దూదేకుల సంక్షేమానికి అన్ని విధాల అండగా ఉంటానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసంలో దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ, జిల్లా కార్యదర్శి సిద్దయ్య, సీనియర్ జర్నలిస్టు, ఎన్నికల వ్యూహకర్త నాగేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు వేయాలి

కర్నూలు(కల్చరల్), జూన్ 16: ఈ ఏడాది శ్రీకృష్ణ జయంతికి విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆవిర్భవించి 60 వసంతాలు అవుతున్న సందర్భంగా వీహెచ్‌పీ షష్టిపూర్తి కార్యక్రమానికి గ్రామ గ్రామాన వీహెచ్‌పీ కమిటీల నిర్మాణాలను పూర్తి చేయాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ హిందూ సమాజానికి ఎదురయ్యే అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదర్కోవడమే లక్ష్యంగా వీహెచ్‌పీ ముందుకు పోతోందని చెప్పారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ జిల్లా కార్యకర్తలందరూ షష్టిపూర్తి సందర్భంగా కనీసం నలుగురు కార్యకర్తలతో సమితుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాబోయే రోజుల్లో జిల్లాలో 9 మండలాల్లో, నగరంలోని 195 బస్తీల్లో తప్పక సమితులను నిర్మాణం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్, విభాగ్ బజరంగ్ దళ్ కన్వీనర్ నీలి నరసింహ, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, నాయకులు గిరిబాబు, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 16: ముస్లింలు, వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖమంత్రి టీజీ భరత్, కర్నూలు జిల్లా కలెక్టర్ డా.జి.సృజన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ జరుపుకుంటారని తెలిపారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

కర్నూలు(న్యూసిటీ): బక్రీదు పండుగను పురస్కరించుకుని నగర ప్రజలకు మేయర్ బీవై. రామయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ. భార్గవతేజ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు మహా మేధావులు
ఓటు ఆయుధంతో వైసీపీకి చావు దెబ్బ : కోట్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

కోడుమూరు, జూన్ 16: రాష్ట్ర ప్రజలు మహా మేధావులని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. కోడుమూరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను ప్రజలు ఓటు అనే ఆయుధంతో చావు దెబ్బ కొట్టారని అన్నారు. తిరిగి కోలుకునే పరిస్థితుల్లో వైసీపీ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా పోలీసు తదితర శాఖల అధికారులను అడ్డు పెట్టుకొని వైసీపీ నాయకులు అరాచకాలు సృష్టించారని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఒక ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధిని కోరుకుంటున్నానని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, ఎల్లెల్సీ నిర్మాణాలకు నిధులు విడుదల చేసిందని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం వాటి నిర్మాణాలను పట్టించుకోలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిధులను విడుదల చేయించి అనుకున్న ప్రాజెక్టులను పూర్తి చేసేలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం కోట్లను టీడీపీ నాయకులు సన్మానించారు.

వైసీపీ నాయకులను చేర్చుకొనే ప్రసక్తే లేదు :

కోడుమూరు ప్రాంతంలోని వైసీపీ నాయకులు టీడీపీలోకి వస్తామని ప్రయత్నాలు సాగిస్తున్నారని కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. అలాంటి వాళ్లను టీడీపీలోకి రానిచ్చుకొనే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీబీ లత, మాజీ సింగిల్ విండో నాయకుడు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి : ఏఐఎస్ఎఫ్

కోడుమూరు, జూన్ 16: జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం వసూళ్ళకు పాల్పడుతున్న అధిక ఫీజులను నియంత్రించాల్సిన అవసరం విద్యాశాఖ అధికారులపై ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అన్నారు.. స్థానిక ఏఐటీయూసీ కార్యలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘంచి విద్యార్థి తల్లిదండ్రుల నుంచి ఫీజులు, పాఠ్యపుస్తకాల పేరుతో అధికంగా డబ్బులు వసూళ్లు చేస్తుంటే విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు దారి తీస్తుందన్నారు. అధిక ఫీజుల వసూళ్లు చేస్తున్న విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, సిద్దు, మహమ్మద్ మోఫీత్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరాముని ధర్మం ఒకటే'

కర్నూలు(కల్చరల్), జూన్ 16: తాను తండ్రి మాట పాటిస్తూ అడవిలో ఉన్నా, అయోధ్యలో పరిపాలన చేసినా రాముడు ఒకే ధర్మం పాటించారని ప్రముఖ ప్రవచన కర్త, హ్యాట్రిక్ నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య ప్రవచన బోధ చేశారు. ఆదివారం నగరంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, జిల్లా రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గుర్రపుశాల అంకయ్యతో 'శ్రీరామాయణ వైశిష్ట్యం' ప్రవచన బోధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచన కర్త మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథం సర్వ మానవ జాతికి సంబంధించినదని చెప్పారు. మనిషి తన ధర్మాన్ని ఎలా నిర్వర్తించాలో శ్రీరాముడు ఆచరించి చూపారని గుర్తు చేశారు. ప్రతివ్యక్తి కష్టకాలంలోనూ ధర్మాన్ని తప్పకూడదని, సుఖ సంతోషాల్లోనూ తన వృత్తి ధర్మాన్ని వీడకూడదని రామాయణ గ్రంథం తెలియజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్‌ఆర్‌కే శర్మ, శతావధాని మద్దూరు రామమూర్తి, కవులు ఎలమర్తి రమణయ్య, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, డాక్టర్ చంద్రమౌళిని, సూర్యశ్రీ, జయరాం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడా పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న ఊట్ల రమేష్‌బాబు

కర్నూలు(కల్చరల్), జూన్ 16: కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలంపిక్ డే సందర్భంగా తైక్వాండో క్రీడాపోటీలను స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ముఖ్యఅతిథి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సునీల్, శ్రీధర్, డీఎస్‌డీవో భూపతిరావు, క్రెడాయ్ అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్ సింగ్, మాస్టర్లు సతీష్ కుమార్, వీరేష్‌బాబు, వెంకట తిమ్మారెడ్డి, శివపరమేష్, రాంబాబు, సుందర్‌రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రీడలు క్రమశిక్షణ నేర్పిస్తాయి


మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులతో డా. శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 16: దేశ భవిష్యత్తును నిర్దేశించి చిన్నారులకు క్రీడలు క్రమశిక్షణ నేర్పిస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం నగరంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మండపంలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు వెంకటేశ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం అధ్యక్షుడిగా సంపతి లక్ష్మీరెడ్డి


ఏకగ్రీవంగా ఎన్నికైన సంపతి లక్ష్మీరెడ్డి, సభ్యులు

కల్లూరు, జూన్ 16: కల్లూరు రైతుసంఘం అధ్యక్షునిగా టీడీపీ సీనియర్ నాయకుడు సంపతి లక్ష్మీరెడ్డి నియామకమయ్యారు. ఆదివారం కల్లూరులోని శ్రీచౌడేశ్వరీ ఆలయంలో గ్రామపెద్దల సమక్షంలో సంపతి లక్ష్మీరెడ్డిని రైతుసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుర్వ మల్లయ్య, కోశాధికారిగా శివరాం ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంపతి లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ గ్రామపెద్దలు, రైతులు ఉమ్మడిగా రైతు సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌వీ.రామకృష్ణ, బి.శ్రీనివాసులు, ఈరన్న, బెక్కెం మహేశ్వరరెడ్డి, గొల్ల వెంకటేశ్వర్లు, రాముడు, దేవదానం, ఫిరోజ్, శేషన్న, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం

కర్నూలు(అర్బన్), జూన్ 16: మెగా డీఎస్సీ ఫైలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సంతకం చేయడంతో థ్యాంక్యూ సీఎం కార్యక్రమం నిర్వహించామని రాయలసీమ ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షులు రాథోడ్ సీమకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని అశోక్ స్టడీ సర్కిల్‌లో రాయలసీమ ఉద్యమ నాయకుల సమక్షంలో డీఎస్సీ నిరుద్యోగులు కార్యక్రమం నిర్వహించారు. మెగా డీఎస్సీ పైన తొలిసంతకం చేసి 16,347 ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాయలసీమ ఉద్యమ యువ నాయకుల ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో చందు, గణేష్, జయరాం పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం అంతంతే

● ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు డల్
● గ్రామాల్లో అందని 24 గంటల వైద్యం
● పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండని వైద్యులు

ఆదోని, జూన్ 16: భవనాలు చూస్తే కార్పొరేట్ ఆస్పత్రులను తలపిస్తుంటాయి.. వైద్య సేవలు, కనీస సౌకర్యాలు ఉండవు. వైద్యులు ఉంటే.... నర్సింగ్ సిబ్బంది ఉండరు. వీరిద్దరూ ఉంటే పరికరాలు ఉండవు. ఈ మూడు ఉంటే టెక్నీషియన్లు ఉండరు. అంతా బాగుంది అనుకుంటే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండరు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అత్యవసర వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది. దీంతో రోగులు, క్షతగాత్రులకు సకాలంలో సరైన వైద్యం అందక ప్రాణాలు గాల్లోకలుస్తున్నాయి.

పై ఫొటోలో కనిపిస్తున్నది ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పీహెచ్‌సీ సెంటర్. ఆదివారం ఆంధ్రజ్యోతి ఈ కేంద్రాన్ని విజిట్ చేయగా.. డాక్టర్లు ఎవ్వరూ కనిపించలేదు. ఉదయం 11 గంటల రాలేదు. అందులో ఉన్న సిస్టర్ మాత్రం పేషెంట్లను చూస్తూ, వారికి ఇంజక్షన్‌లు ఇస్తూ, టాబ్లెట్లు అందజేస్తూ.. మరోవైపు డెలివరీ కోసం వచ్చిన వారిని కూడా పరిశీలిస్తూ ఉంది. అన్ని సేవలను మీరు చేస్తున్నారేమిటని ప్రశ్నించగా 'అత్యవసర కేసయితే డాక్టర్ వస్తారని, మీరెవరో చెబితే ఫోన్ చేస్తానని, నన్ను ఏమీ అడగద్దని అక్కనుంచి వెళ్లిపోయారు. ఈ నెల 10న సోమవారం రోజున కోసిగి గ్రామంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన అంజనమ్మ మూడో కాన్పు కోసం పెద్దతుంబలం పీహెచ్‌సీకి తెచ్చారు. నర్సు డెలివరీ చేయడంతో ఈ కాన్పులో తల్లీబిడ్డ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఇదొక్కటే కాదు.. ఏడు నెలల వ్యవధిలో దాదాపు ఏడుగురు శిశువులు, ముగ్గురు తల్లులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఒకరు లేదా ఇద్దరు సిబ్బంది ఉండి అన్ని తామై చూస్తున్నారు. ఆదివారం రోజు సెలవు దినం కావడంతో అధికారులు ఎవరూ ఆసుపత్రి వైపు తొంగిచూడకపోవడం గమనార్హం.

● సక్రమంగా అందని వైద్యం

అనారోగ్య సమస్యలతో ఆరోగ్య కేంద్రాలకు వస్తే డాక్టర్లు కనీసం చేతితో నాడిని సైతం పరీక్షించడం లేదనే విమర్శలున్నాయి. పీహెచ్ సీల్లో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో తెలియడం లేదని పలువురు వాపోయారు. ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు కూడా చేయడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందక ప్రతి ఏటా ఎన్నో ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. అత్యవసరమైన వైద్యసహాయం కావాలని వచ్చిన వారికి కనీస సమాచారం కూడా ఇచ్చే వారు ఆయా కేంద్రాల్లో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. పీహెచ్‌సీల్లో సక్రమంగా అందని వైద్య సేవలపై తరచూ ఉన్నతాధికారులు సమీక్షల్లో ఆగ్రహం వ్యక్తం చేసినా సిబ్బంది, వైద్యుల తీరులో మార్పు రాకపోవడం శోచనీయం.


నొప్పులు రావడంతో గర్భిణిని ఆసుపత్రికి తీసుకొస్తున్న బంధువులు


పెద్దతుంబళం పీహెచ్‌సీ కేంద్రం


మూతబడిన డాక్టర్ గది

● ఫోన్ చేస్తేనే డాక్టర్ వస్తారు...

24 గంటలు వైద్యసేవలు అందించాల్సిన ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండడం లేదు. దీంతో రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందడం లేదనే విమర్శలున్నాయి. రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. అత్యవసర వైద్యం కోసం ఎవరైనా వస్తే, సిబ్బంది ఫోన్ చేస్తే తప్ప వైద్యులు రావడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధాన రహదారుల్లో, ఇతర మార్గాల్లో నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను వైద్యం నిమిత్తం 24 గంటల ఆసుపత్రికి వచ్చినా సరైనా చికిత్సలు అందించేందుకు వైద్యులు ముందుకు రావడం లేదు. రాత్రి వేళల్లో అయితే అది కూడా అందదు. క్షతగాత్రుడిని చూడకుండానే పరిస్థితి విషమంగా ఉందంటూ కర్నూలుకి గాని, సమీపంలోని ఆదోని ఏరియా ఆస్పత్రికి గాని రెఫర్ చేస్తుంటారు.

ఈ విషయంపై డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో సత్యవతిను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. 'డాక్టర్ పక్కనే ఉంటారని, ఫోన్ చేస్తే అందుబాటులోకి వచ్చి చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు. కంటిన్యూగా ఉండేందుకు సిబ్బంది కొరత వల్లే అలా జరుగుతోందని, ఉన్నతాధికారులకు చెప్పి సిబ్బంది కొరత లేకుండా చూస్తామని పేర్కొన్నారు. నెలకు 120 నుండి 150 వరకు కాన్పులు చేస్తున్నామని పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి ఎంపీ నిధులు ఇవ్వాలి

మద్దికెర, జూన్ 16: మద్దికెర మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఆవుల పెద్దన్న, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నర్రా సుధాకర్, మాజీ కోఆప్షన్ ఇమామ్ సాహెబ్, మాజీ ఎంపీటీసీ గొర్రెల శంకర్ కోరారు. ఆదివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం సమర్పించి మండలానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని, మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు అమరావతి, యశ్వంత్‌పూర్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. టీడీపీ నాయకులు ఐ.రాముడు, శ్రీనివాసులు, పుల్లన్న ఉన్నారు.

మంత్రి టీజీ భరత్‌కు అభినందనలు

మద్దికెర, జూన్ 16: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ను తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు టైలర్ హరి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కర్నూలు పట్టణంలో టీజీబీని కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఎంతో ఉపయోగపడే పరిశ్రమలు నెలకొల్పి వాటిల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం మల్లికార్జున, ఈశ్వరయ్య ఉన్నారు.

వైసీపీ పాలనలో పట్టణ అభివృద్ధి శూన్యం

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 16: వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో ఎమ్మిగనూరు పట్టణ అభివృద్ధి ఆటకెక్కిందని సీపీఐ పట్టణ కార్యదర్శి జీ రంగన్న తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణంలో 13వ వార్డులోని బిలాల్ మసీదు వెనుక ఉన్న ప్రాంతాన్ని సీపీఐ ఆధ్వర్యంలో రోడ్లు, డ్రైనేజీ లేని కాలనీలను పరిశీంచారు. పట్టణంలో 34 వార్డులు ఉన్నప్పటికీ ఏ ఒక్క వార్డులో సంపూర్ణంగా డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్ లైన్లు ఏర్పాటు చేయలేదని, కేంద్రం వెచ్చించిన 14 ఫైనాన్స్ నిధులతో తూతూ మంత్రంగా వార్డులలో మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా పట్టణ శివారు కాలనీలైన మైనారిటీ కాలనీ, మునెప్ప నగర్, మిలటరీ కాలనీ, శివన్ననగర్ తదితర కాలనీలలో రోడ్లు లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఖాజా, ఇస్మాయిల్, నర్సింహులు, హుస్సేన్, ఖాజాబీ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

హరిద్వార్‌లో రాఘవేంద్రస్వామి మఠం నిర్మాణం

● 19న పీఠాధిపతులచే ప్రారంభానికి సిద్ధం


హరిద్వార్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన శ్రీమఠం

మంత్రాలయం, జూన్ 16: మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో గంగానది ఒడ్డున హరిద్వార్‌లో రూ.8 కోట్లతో రాఘవేంద్రస్వామి మఠం నిర్మాణం పూర్తి చేశారు. ఈ నెల 19న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల చేతుల మీదుగా శాంతిపూజలు చేసి ప్రారంభించనున్నారు. ఇప్పటికే శ్రీమఠం విచారణకర్త శ్రీనివాస్ ఖస్గే దంపతులు హరిద్వార్ మేనేజర్ ప్రసాదాచార్, దేవీ ప్రసాదాచార్, మనోజాచార్య, బద్రినాథాచార్యులు ఆదివారం భవన ప్రారంభానికి వాస్తు, రాక్షోజ్ఞ నరసింహ మంత్ర దుర్గ, నవగ్రహ, భువరహ హోమాలను నిర్వహించారు. దాదాపు రూ.8కోట్లతో మృత్తిక రాఘవేంద్రస్వామి బృందావనం, విశాలమైన హాలు, 6 ఏసీ షూట్ రూములు, 6 నాన్ ఏసీ, 2 డార్మెంటరీలను సిద్ధం చేశారు. హరిద్వార్, బద్రినాథ్, గంగోత్రి, కేదార్‌నాథ్ తదితర ప్రాంతాలకు వెళ్లి దర్శనార్థం వచ్చే భక్తులకు రాఘవేంద్రస్వామిని దర్శించుకునే విదంగా ఈ భవనాన్ని నిర్మించారు. ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య హరిద్వార్ మఠం భక్తులకు అందుబాటులోకి రానుంది.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూన్ 16 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్ ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి మంత్రాలయంలో బస చేశారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజరు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. ఈయన వెంట ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రహ్లాదరాయల చెక్క రథోత్సవం : రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.

జీడీపీ ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

గోనెగండ్ల, జూన్ 16: గాజులదిన్నె ప్రాజెక్టు కట్ట ఎత్తు పెంచడం వల్ల ఎగువ ప్రాంతంలోని గ్రామాల రైతుల భూములు నీట మునిగి పోతాయని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం గాజులదిన్నె ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు, ముంపు బాధితరైతు సంఘం నాయకులు, రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ కట్ట ఎత్తు పెంచడం వల్ల జీడీపీ ఎగువ ప్రాంత రైతుల భూములు ప్రాజెక్టు నీటిలో మునిగిపోతాయని, ఆ భూములకు అధికారులు నిబంధనల ప్రకారం నిధులు విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్టర్ ఇష్టాను రాజ్యంగా ఎకరం కు కేవలం 4.20లక్షలు ఇస్తామంటే కుదరదని తెలిపారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేయకుండా వారి అనుమతి తీసుకోకుండా ఎలా పనుల చేపట్టారని అధికారులను ప్రశ్నించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బీవీ అన్నారు. ఆర్‌డీఎస్ ను జీడీపీ అనుసందానం చేసి ఎమ్మిగనూరు ప్రజల తాగు, సాగునీటి కష్టాలను తీర్చుతామన్నారు. టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, మాజీ ఎంపీపీ హనుమంతు, బేతాల బడేసా, ఎర్రబాడు శ్రీనివాసులు, పిల్లిగుండ్ల ఉల్లిగడ్డలరాముడు, తిరుపతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాల్స్ కోసం వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేయండి : బీవీ

ఎమ్మిగనూరు, జూన్16: మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసేందుకు ఎస్ఎల్ఎఫ్‌ల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే తిరిగ చెల్లించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మెప్మా పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎన్ని పొదుపు గ్రూపులు ఉన్నాయి.. ఎంతమంది సభ్యులు ఉన్నారు.. ఆర్పీలు ఎంతమంది ఉన్నారు, పర్యవేక్షులు ఎంత మంది ఉన్నారు.. గ్రూపులకు బ్యాంకుల నుంచి ఎంత మేర రుణాలు ఇచ్చారు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాల్స్ ఏర్పాటు కోసం రూ. 20లక్షలు ఎస్ఎల్ఎఫ్‌ల నుంచి వసూలు చేసి ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని, ఆ మొత్తాన్ని మీ దగ్గరే ఎలా ఉంచుకుంటారని పట్టణ సమైఖ్య గ్రూపు లీడర్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఆమె స్పందిస్తు వసూలు చేసిన మొత్తం బ్యాంకులో ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తాన్ని వెంటనే ఎస్ఎల్ఎఫ్‌లకు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం టిడ్కో గృహాలు ఇవ్వకుండానే వారికి బ్యాంకులో రుణాలు ఎలా ఇప్పిస్తారని ప్రశ్నించారు. లబ్దిదారులనుంచి అనవసరంగా వడ్డీ కట్టిస్తున్నట్లే కదా అని ప్రశ్నించారు. ఇందుకు అధికారులనుంచి, సిబ్బందినుంచి సరైన సమాధానం రాకపోంటంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో షెల్టర్లు ఎన్ని ఉన్నాయని అవి ఎక్కడ ఉన్నాయని అధికారులను అడిగారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఒక షెల్టర్ ఉందని ఆవార్డుకు చెందిన ఆర్పీ చెప్పటంతో ఎంత మంది ఆశ్రయం పొందుతున్నారని, దాని నిర్వహణ కు ఎంత వెచ్చిస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు పీఓ, ఆర్పీ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఒకసారి 20మంది అని, మరోసారి 15 మంది అని చెప్పుకు రావటంతో సరైన సమాధానం చెప్పాలని లేని పక్షంలో ఇప్పుడే వెళ్లి చూడాల్సి వస్తుందని అన్నారు. దీంతో ఐదు మంది ఉండోచ్చని చెప్పుకోచ్చారు. షెల్టర్లు ఉండేది రాజకీయ నాయకుల కోసమా.. లేక నిరాశ్రయిల కోసమా అంటూ నిలదీశారు. మెప్మాపై మరో సారి సమీక్ష చేస్తానని ఆపాటికి అన్ని సక్రమంగా ఉండాలని లేని పక్షంలో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పీఓ జయవర్ధన్, ఆర్పీలు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

● **సీసీ రోడ్డుపనులకు భూమి పూజ :** పట్టణంలోని నాలుగో వార్డులో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రామదాసు గౌడ్, నాయకులు కొండయ్య చౌదరి, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, చేనేత మల్లి, సుందరాజు, పెద్ద రంగన్న, బచ్చాల రంగన్న, రవి, భాస్కర్, బచ్చాల రంగన్న, కృష్ణ, ఇబ్రహీంలు పాల్గొన్నారు.



టమోటా రూ.80

ఆలూరు, జూన్ 16: టమోటో సాగు తగ్గి పోవడంతో ఆదివారం ఆలూరు మార్కెట్‌లో కేజీ టమోటో ధర రూ.80కు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. దీనికి తోడు కూరగాయల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోవడంతో ఇవేం ధరలు బాబోయి అంటూ ప్రజలు వాపోతున్నారు...

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్‌కార్డులు

గోనెగండ్ల, జూన్ 16: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డు ఇచ్చేలా సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం గోనెగండ్ల జర్నలిస్టులు స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని సన్మానించారు. సందర్బంగా బీవీ మాట్లాడుతూ జర్నలిస్టులు వైసీపీ పాలనలో ఎంతో ఇబ్బందులు పడ్డారని ఇక పై అలాంటి ఇబ్బందుల ఉండవన్నారు. కార్యక్రమంలో దండుఖాజా, షఫీబాషా, హమ్మద్ హుసేన్, మన్సూర్, ఈశ్వర్, అక్బర్, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రైతులు ధ్రువపత్రాలు అందజేయాలి

వెల్దుర్తి, జూన్, 16 : పట్టణంలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు తమ ధ్రువపత్రాలను అందజేయాలని సీఈవో రామకృష్ణుడు తెలిపారు. సభ్యులు తమ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రెండు ఫోటోలు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి : డాక్టర్ పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 16: విద్యతోనే సమాజాభివృద్ధితో సామాజిక వర్గంలోనూ చైతన్యం వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు. ఆదివారం మంగళ ఆంజనేయ స్వామి దేవాలయంలో వాల్మీకి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి అంటే గతంలో చిన్నచూపు ఉండేదని, నేడు ఎంతో మంది విద్యావంతులుగా ఎదిగి ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. తల్లిదండ్రులు కూడా వంశపారంపర్య వృత్తులకు స్వస్తి పలికి ఉన్నతంగా రాణించేలా చదువులు చదివించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. జిల్లాలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ప్రథమ స్థానంలో ఉన్నవారికి నగదు పురస్కారం కింద రూ.10వేలు, ద్వితీయ స్థానం వారికి రూ.6వేలు, తృతీయ స్థానం రూ.4వేలు పాటు పురస్కారాలను అందజేసి వారిని మెమొంటోతో ఘనంగా సన్మానించారు. వారితోపాటు ఆదోని మండలంలోని ప్రథమ, తృతీయ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి సైతం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, గుడిసె కృష్ణమ్మ, చైర్‌పర్సన్ శాంతా, డాక్టర్ కేఆర్ స్వామి, వీరన్న, రిటైర్డ్ ఎంఈవో శివరాములు, జెడ్పీ హెచ్‌ఎం సత్తెన్న, రమేష్ నాయుడు పాల్గొన్నారు.


వాల్మీకి పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే పార్థసారధి

అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

తుగ్గలి, జూన్ 16: వైసీపీ అక్రమార్కులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు మాబాషా అన్నారు. ఆదివారం మైనార్టీ సంక్షేమం న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని, పత్తికొండ నియోజక వర్గంలోని సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా మైనార్టీలకు టీడీపీ పెద్దపీట వేసిందని, అలాగే మైనార్టీ సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. మాజీ ఎంపీపీ కొమ్మెవెంకటేశ్ పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగలు తగిలి మహిళ మృతి

హాలహర్వి, జూన్ 16: మండలంలోని గూళ్యం గ్రామంలో పొలంలో విద్యుత్ తీగలు తగిలి లక్ష్మీ (32) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఆదివారం సాయంత్రం పొలంలో పనులు చేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో కరెంట్ షాక్‌తో మృతి చెందింది. భార్య పొలంలో కనపడకపోవడంతో భర్త వీరేష్ వెతుక్కుంటూ ముందుకు వచ్చి చూస్తే, తీగలు తగిలి శవమై కనిపించడంతో బోరున కన్నీరు పెట్టుకున్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు.

వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఆదోని, జూన్ 16: నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీ ఇన్‌చార్జీ, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కౌన్సిలర్ అంజని, ఎంఎం కాలనీ నుంచి వేణు కుమారులు రామయ్య, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, గిరి, శివశంకర్, చరణ్, అంజయ్య, రవికుమార్, నాగలాపురం గ్రామం నుంచి వెంకటేష్, జనార్ధన్, చిన్న వీరేష్, పెద్ద వీరేష్, శ్రీనివాసులు, తిమ్మప్ప, చిన్ని రామాంజనేయులు, పెద్ద ఊరుకుందు, మోహన్, వెంకటరాముడు, గోవిందుతోపాటు 150 కుటుంబాలు టీడీపీకి చేరారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎక్కడా కూడా అభివృద్ధి అనేదే లేదన్నారు. ఐదేళ్లపాటు కక్ష సాధింపు ధోరణితోనే వైసీపీ పాలన సాగింది తప్ప, అభివృద్ధి ఎక్కడ చేయలేదని పేర్కొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

జీవో 117ను రద్దు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 16: ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థ పై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 117 రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలుకుతున్నామని, నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. సమావేశంలో రామకృష్ణ, గోపాల్, రామాంజనేయులు, వెంకటేశులు, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

16ఏడీఎన్8: ఎమ్మెల్యేను కలిసిన ఎల్‌టీపీలూ

ఎల్‌టీపీల సమస్యలు తెలుసుకుంటాను

ఆదోని టౌన్, జూన్ 16: మునిసిపాలిటీ పరిధిలోని లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మునిసిపల్ సిబ్బందితో ఎల్‌టీపీల సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. రంగస్వామి, ప్రసాద్, శంకర్ రావు, చంద్రశేఖర్, అది, రఫిక్ పాల్గొన్నారు.

బీపీఎస్ స్కీమ్‌ను ప్రకటించాలి

● బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు

ఆదోని టౌన్, జూన్ 16: పట్టణంలో బీపీయస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్)ను ప్రభుత్వం ప్రకటించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్లాన్ మంజూరుకు అవకాశం లేని చిన్నపాటి సందులలో నిర్మాణాలను చేసుకొని పేద, మధ్యతరగతికి చెందిన వారికి, ప్లాన్ మంజూరు లేని కారణంగా ఆస్తి పన్ను వంద శాతం అధికంగా విధుస్తుండటంతో అనేక మంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రవేశపెట్టిన, బీపీయస్ స్కీమ్‌ను వైసీపీ ప్రభుత్వం వచ్చాక రద్దు చేయడంతో అనేక మంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ స్కీమ్ ద్వారా ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం కూడా రావడమే కాకుండా సామాన్యులకు ఎంతో ఊరట లభించే అవకాశం ఉందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరవాత తమ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

నగరడోన ప్రాజెక్టును పూర్తి చేయండి

● కర్నూలు ఎంపీని కలసిన రైతులు

ఆలూరు రూరల్, జూన్ 16: పెండింగ్‌లో ఉన్న నగరడోన ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని హత్తిబెళగల్ గ్రామ రైతులు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. ఆదివారం ఎంపీని కలసి వివరించారు. ఆలూరు ప్రాంతంలో సాగు తాగునీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడతున్నారని చెప్పారు. జింకల బారి నుంచి పంటలను రక్షణ కల్పించి జింకల పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. నగర డోన ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. అనంతరం ఎంపీ పంచలింగల నాగరాజును రైతులు ఘనంగా సన్మానించారు.

టీడీపీ కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటా

మంత్రాలయం, జూన్ 16: నియోజక వర్గంలో టీడీపీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం రచ్చుమర్రి గ్రామానికి చెందిన దాదాపు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డిలకు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, అడ్వకేట్ విజయకుమార్, కోసిగి వుశేనీ, వెంకటరాముడు, హనుమంతు, మజ్జిగ వీరేష్, పెద్ద ముకురప్ప, వీరన్న, బంగారయ్య, చిదానంద, ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి

తుగ్గలి, జూన్ 16: వర్షాకాలంలో విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌పార్మర్ల వద్ద నీటి తడిగా ఉండి వైర్లతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రైతులందరూ విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం తుగ్గలి తదితర గ్రామాల్లో వ్యవసాయ తోటల్లో రైతులతో ఆయన మాట్లాడుతూ పైర్లకు నీరు కట్టేందుకు వెళ్లి విద్యుత్ మోటార్లు ఆన్ చేసేటప్పుడు తడి చేతులతో ఆన్ చేస్తుంటారని, అలాంటి సమయంలో వర్షానికి తడిసిన మోటార్లు కరెంటు షాక్‌కు గురై ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. రైతులు మోటార్లు ఆన్ చేసే సమయంలో తడి చేతులతో కాకుండా ఎండినకట్టెతో గానీ, ప్లాస్టిక్ స్టిక్‌తోగానీ ఆన్ చేయాలని సూచించారు. అలాగే ఇంటి విద్యుత్ వాడుతున్న వినియోగదారులు కూడా జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా విద్యుత్ సమస్యలువస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వదంతులు అవాస్తవం

● ఆలూరు ఎమ్మెల్యే బీ విరుపాక్షి

ఆలూరు, జూన్ 16: నేను పార్టీ మారుతున్నట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూప్‌లో వస్తున్న వదంతులు అవాస్తవమని ఆలూరు ఎమ్మెల్యే బీ లేపాక్షి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను గుర్తించి టిక్కెట్ ఇచ్చి గెలిపించిన జగన్ వెంటే ఉంటానన్నారు. ఆలూరు అభివృద్ధి కోసమే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలు నాకు తెలుసన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన పోరాటాలు చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.. ముఖ్యంగా నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్య, రహదారుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తామని పేర్కొన్నారు.